రేపు వాహనాల వేలం

పోచారం: నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన 3 వాహనాలకు శనివారం ఉదయం వేలంపాట నిర్వహించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ జూపల్లి రవి తెలిపారు. వివరాలకు 8712658736, 9642377661.

నేటి నుంచి కీసరగుట్టలో శ్రావణమాసోత్సవాలు



రామలింగేశ్వరస్వామి

కీసర: ప్రఖ్యాత శైవక్షేత్రమైన కీసరగుట్ట భవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో నేటి నుంచి ఆగస్టు 23 వరకు శ్రావణ మాసోత్సవ ప్రత్యేక పూజలు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు నెల రోజుల పాటు శ్రావణ మాసోత్సవాల సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డిలు తెలిపారు. భక్తుల కోసం క్యూలైన్లు, ప్రసాదాలు, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వివరించారు. సికింద్రాబాద్, ఈసీఐఎల్, కుషాయిగూడ తదితర ప్రాంతాల నుంచి కీసరగుట్టకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది.

గ్రీన్‌పార్కు కాలనీని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతా

కాప్రా: గ్రీన్‌పార్క్ కాలనీని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి అన్నారు. గురువారం కాలనీలో పర్యటించిన ఆయన యూబీడీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రీన్‌పార్క్ కాలనీని ఆధునిక పద్ధతిలో సుందరీకరణ, కాలనీలో మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణం నెలకోల్పుతామని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రిక్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కార్పొరేటర్ సూచించారు. డివిజన్ పరిధిలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు సమస్యలు గుర్తించి పరిష్కరించాలన్నారు. డివిజన్ పరిధిలోని నిర్మల్‌నగర్ నుంచి కాప్రా తహసీల్దార్ ఆఫీస్ వరకు, అక్కడి నుంచి సాయిబాబానగర్ వరకు ఒక్కో ఇన్‌చార్జ్, ఇద్దరు సహాయక సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ డీఈ రవీందర్, సూపర్‌వైజర్ రాకేష్, సిబ్బంది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రేవియార్డు కేటాయించాలి

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్‌లో క్రిస్టియన్ మైనార్టీలకు ప్రత్యేక గేవియార్డు కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గ పాస్టర్ల సంఘం ప్రతినిధులు గురువారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఉన్నతాధికారులతో సంప్రదించి త్వరలో తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పాస్టర్స్ సంఘం ప్రతినిధులు గొనే సోలమన్‌రాజ్, రిచర్డ్, దేవరాజు, ఇన్నాబు, ఇల్లూరి ప్రసాద్‌రావు, ఏఎస్ అనిల్‌రాజు తదితరులున్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులతో పరమేశ్వర్‌రెడ్డి

కుషాయిగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మీర్‌పేట్, హెచ్‌బీకాలనీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య గురువారం రాజీవ్‌నగర్ ప్రభుత్వ స్కూల్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. మల్లేష్, మల్లేష్‌గౌడ్, యాకయ్య, అనిల్, జెమిని, కృష్ణనాయక్, రాజు, శ్రీకాంత్, ఉదయ్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్ ఎన్.శంకర్ సూచించారు. గురువారం మల్లాపూర్ దత్తాత్రేయనగర్ కాలనీలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రతి ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటినిల్వలను పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. సర్కిల్ ఎంటమాలజీ ఏఈ రమేష్, సూపర్‌వైజర్ కనకరాజు, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిలో మహిళల ప్రగతి

ఫుడ్ తయారీలో మెప్మా మహిళలు | విక్రయాల కోసం వారంతపు సంతల్లో ప్రత్యేక స్టాల్స్ | మెరుగుపడుతున్న వ్యాపారం

ఎన్నో ఏళ్లుగా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. వారి విజయ గాథలు ఎన్నో ఉన్నాయి. అలాంటి వారి అడుగుజాడల్లోనే మేడ్చల్‌కు చెందిన మహిళలు కొందరు నడుస్తూ.. విజయవంతంగా వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. తాజాగా పట్టణాల్లో చేపట్టిన 100 రోజుల ప్రణాళిక అమలులో మరిన్ని కార్యక్రమాలు చేస్తుండటంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు.
– మేడ్చల్



మేడ్చల్ వారాంతపు సంతల్లో మెప్మా స్టాల్స్

రూ.4 కోట్ల వ్యాపారాలు..

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ద్వారా 648 స్వయం సహాయక సంఘాలు ఉండగా.. వాటిల్లో 6480 మంది సభ్యులుండగా.. రూ.4 కోట్ల టర్నోవర్‌తో వ్యాపారాలు సాగిస్తున్నారు. రూ.19 కోట్ల వ్యాపారాలు సాగించాలనే లక్ష్యంగా పెట్టుకున్నా.. ప్రస్తుతం రూ.4 కోట్ల వ్యాపారాలతో మహిళలు అగ్రభాగంలో ఉన్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా మహిళల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడంతో బ్యాంకు లింకేజీల ద్వారా రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు పొందుతున్నారు.

పరిస్థితులకు తగినట్లుగా వ్యాపారాలు..

మేడ్చల్‌లో మెప్మా మహిళలు పరిస్థితులకు తగినట్లుగా తమ వ్యాపారాలు అప్‌గ్రేడ్ చేసుకుంటూ లాభాలు గడిస్తున్నారు. రోటోస్ వ్యాపారాలకు స్వస్తి పలుకుతూ.. మార్కెట్‌లో ఏ వ్యాపారాలకు అధిక గిరాకి ఉంటుందో.. వాటిని సెలక్ట్ చేసుకుని ఆ దిశలో వ్యాపారాలు చేస్తున్నారు. నేటి సమాజంలో అందరూ మంచి ఆహారానికి ప్రాధాన్యత ఇస్తుండటంతో మహిళలు ఇంటి వంటకాలపై దృష్టి పెడుతున్నారు.

పిండి వంటలకు ప్రాధాన్యం..

ప్రధానంగా తెలంగాణ రుచులలో పిండి వంటకాలైన మురుకులు, సకినాలు, స్వగృహ ఫుడ్స్‌పై దృష్టి పెట్టే వాటి తయారీలో నిమగ్నమవుతున్నారు. వీటితో పాటు బ్యూటీ పార్లర్, టైలరింగ్ షాపులు, కిరాణావ్యాపారాలు, లేడిస్ ఎంపోరియం, క్యాటరింగ్ తదితర వ్యాపారాలకు ప్రాధాన్యతనిస్తూ.. వ్యాపారాలను లాభాల దిశగా నడిపిస్తున్నారు.

వారాంతపు సంతల్లో స్టాల్స్..

మహిళలు వ్యాపారాలు చేయడంతో పాటు వాటికి మార్కెటింగ్ సైతం ముఖ్యమని గుర్తించిన మేడ్చల్ మున్సిపల్ అధికారులు వాటిని విక్రయించడానికి కొత్త పుంతలు తొక్కుతున్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లేకపోవడం

మేడ్చల్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లేకపోవడంతో ప్రతీ కాలనీలో వారాంతపు సంతలు నిర్వహిస్తున్నారు. సంతల్లో కూరగాయాలు, ఇతర వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో మెప్మా అధికారులు మహిళలు తయారు చేసే పిండి వంటకాలు, ఇతర వస్తువులు విక్రయాల కోసం ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి వ్యాపారాలు చేయిస్తున్నారు.

చిరు వ్యాపారులతో కలిసి..

మహిళలు తయారు చేయడంలో దిట్టగా ఉన్న అమ్మకాల్లో అంతగా చాకచక్యంగా లేకపోవడంతో మున్సిపల్ సహకారంతో రుణాలు పొంది వ్యాపారాలు చేస్తున్న చిరు వ్యాపారులతో కలిసి వ్యాపారాలు చేయిస్తున్నారు. వారికి అనుభవం ఉండటంతో స్టాల్స్‌లో వ్యాపారాలు మరింత పెరుగుతున్నాయి.

అన్ని సంతల్లో స్టాల్స్ ఏర్పాటు చేశాం



మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే ప్రతి కాలనీ సంతల్లో మెప్మా మహిళలతో స్టాల్స్ ఏర్పాటు చేయిస్తాం. ప్రతి ఇంటికి మెప్మా మహిళ తయారీ వస్తువులు చేరాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. అన్ని వార్డుల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి మహిళా వ్యాపారులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం.
– నరేష్, మేడ్చల్ మెప్మా, కో – ఆర్డినేటర్

స్టాల్స్‌తో వ్యాపారం పెరిగింది



సంతల్లో అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేయడం, వాటిల్లో తమ స్టాల్స్ ఏర్పాటు చేయడంతో వ్యాపారాలకు ఆదరణ లభిస్తుంది. తయారు చేసిన పిండి వంటకాలు సులువుగా అమ్ముడుపోతున్నాయి. గతంలో ఆర్డర్ ఉంటే మాత్రమే తయారు చేసే వాళ్ళం సంతరోజు స్టాల్స్ ఉండంట వల్ల ఆర్డర్ కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండాపోయింది.
– అనిత, మేడ్చల్

డిమాండ్ పెరిగింది



స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వండకాలను స్టాల్స్‌లో పెట్టడంతో గిరాకి పెరిగింది. మహిళలు సైతం నిత్యం అమ్ముడుపోయో వస్తువుల తయారీ కోసం ఉత్సాహం చూపిస్తున్నారు. దీంతో డిమాండ్ పెరిగింది. మెప్మా అధికారులు, మున్సిపల్ అధికారుల ప్రోత్సాహం బాగా ఉండటంతో వ్యాపారాల్లో మేడ్చల్ మహిళలు రాణిస్తున్నారు.
– రాధిక, మేడ్చల్

ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టండి



రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ ఈటల

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అయోధ్య క్రాస్ రోడ్డు సమీపంలో రైల్వేట్రాక్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణం త్వరగా చేపట్టాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కోరారు. ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎంపీ రైల్వే మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్‌యూబీ లేకపోవడంతో మేడ్చల్, గండిమైసమ్మ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు రైల్వేగేట్ వల్ల నిత్యం ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న ఆర్‌యూబీ పనులను త్వరగా పూర్తి చేయించాలని కోరారు. మేడారంలో సమ్మక్క, సారలమ్మ జాతరకు లక్షల మంది వెళ్తున్నందున జాతరకు రైలు సదుపాయంపై పరిశీలించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్

కీసర: కీసర మండలం పరిధిలోని తిమ్మాయిపల్లి, అంకిరెడ్డిపల్లి గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం ప్రొసీడింగ్స్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా కీసర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోలా కృష్ణయాదవ్ మాట్లాడుతూ.. పేదలందరికీ గూడు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు ధృడసంకల్పంతో పనిచేస్తోందన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ విజయారెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షులు ముప్పా రామారావు, సెక్రటరీ సంజీవరెడ్డి, నాయకులు సురేష్‌గౌడ్, బలరాం, సతీష్, రాజలింగం, భాగ్యమ్మ, లలిత, ఐలేష్, కుమార్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు

శామీర్‌పేట్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ మను చౌదరి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

శామీర్‌పేట్: విద్యార్థులు ఇష్టంగా చదివి మంచి ఫలితాలను సాధించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. గురువారం తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి విజయకుమారితో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మధ్యాహ్న భోజన నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల కొరత ఉందని ప్రధానోపాధ్యాయుడు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. ఇంజినీర్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, తూంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎస్ఆర్ జ్యోతి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



యాద్గార్‌పల్లిలో మొక్కలు పంపిణీ చేస్తున్న కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా యాద్గార్‌పల్లిలో కమిషనర్ వెంకట్‌రెడ్డి మొక్కలను పంపిణీ చేశారు. డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి, ఇంటింటికి పొడి, తడి వ్యర్థాలను వేరు చేయడంపై అవగాహన కల్పించారు. డీఈఈ బాలమురళి, మున్సిపల్ మేనేజర్ వెంకటేశం, ఆర్ఐ రామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్స్, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ ప్రజలు మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత సైతం తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి అన్నారు. 100 రోజుల ప్రణాళిక అమలులో భాగంగా 21వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మెప్మా మహిళలు నిర్వహించిన స్ట్రీట్ ఫెస్టివల్‌ను ప్రారంభించి మహిళలు ఇంట్లో మొక్కలు నాటేందుకు మొక్కలు పంపిణీ చేశారు. ఎన్విరాల్‌మెంట్ ఇంజినీర్ జ్ఞానేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ శంకర్, మెప్మా ఇన్‌చార్జ్ నరేష్ పాల్గొన్నారు.



మొక్కలు అందజేస్తున్న కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి

అయ్యో పాపం !

వర్షంలోనే భోజనం



బురదలో భోజనం చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్: పట్టణంలోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న బాలికల ప్రైమరీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని బయటే పెడ్డించారు. గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా జల్లులు పడుతున్నాయి. మధ్యాహ్న భోజన కార్మికులు వర్షానికి తడుస్తూనే చిన్నషెడ్‌లో భోజనాన్ని తయారు చేశారు. భోజన సమయానికి వర్షం పడటంతో ఉపాధ్యాయులు కనీస ఆలోచన చేయకుండా పిల్లలకు స్కూల్ గ్రౌండ్‌లోనే భోజనం వడ్డించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధ్యాయులు స్టాఫ్ రూంలో కూర్చొని భోజనం చేయడం గమనార్హం.

విచారణ చేపడతాం

వర్షంలో పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టిన సంగతి తమ దృష్టికి రాలేదు. వర్షం వచ్చిన సమయంలో పిల్లలకు భోజనాలు వరండా, తరగతి గదిలోనే ఏర్పాటు చేయాలి. వర్షంలోనే పిల్లలకు భోజనాలు పెట్టిన ఘటనపై పూర్తి విచారణ చేసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటాం.
– ఎంఈఓ శంకరయ్య

'ఆపరేషన్ ముస్కాన్'లో 9 మందికి విముక్తి

మేడ్చల్: బాల కార్మికులతో పనిచేయిస్తున్న వారి భరతం పట్టేందుకు ఏర్పాటైన 'ఆపరేషన్ ముస్కాన్' అధికారులు గురువారం మేడ్చల్ పరిధిలో పలు పరిశ్రమలు, హోటళ్లలో దాడులు నిర్వహించి 9 మంది బాలకార్మికులకు వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలకార్మికులతో పనిచేయిస్తున్నారని, పలు సంస్థలపై ఆకస్మిక దాడులు చేయగా.. మేడ్చల్ పారిశ్రామికవాడలోని జీజీఆర్ కంపెనీలో ముగ్గురు, సర్వోత్తం స్టీల్‌లో ఒక్కరు, ఎలిమెంట్ సెవెన్ బార్‌లో ముగ్గురు, వివిధ హోటళ్లలో పనిచేస్తున్న మరో ఇద్దరు బాలకార్మికులను గుర్తించి వారికి వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించారు. బాలకార్మికులతో పనిచేయిస్తున్న యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

నోట్‌బుక్స్ పంపిణీ

ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం కేటీఆర్ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేశారు. మాజీ సర్పంచ్‌లు వెంకటేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శివశంకర్, బిక్షపతిగౌడ్, నాయకులు రమేష్, ఐలయ్య యాదవ్, శ్రీనివాస్‌ముదిరాజ్, ప్రవీణ్, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మణ్, బాల్‌రాజ్, దుర్గరాజ్‌గౌడ్, ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో స్టేషనరీ విక్రయం !

తగిన చర్యలు తీసుకోవాలని వినతి

మల్కాజిగిరి: మండలంలో కొన్ని ప్రైవేట్ స్కూల్స్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ సీనియర్ నేత వేణుయాదవ్ మండల విద్యాధికారి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లోనే పుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తున్నా.. అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. స్థానిక కార్పొరేటర్ దృష్టికి సైతం తీసుకెళ్లామన్నారు.

పంట పొలాల్లోకి కంపెనీ వ్యర్థ జలాలు !

దెబ్బతింటున్న పొలాలు



మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని రాజబోల్లారంలోని ఓ కంపెనీలో ఉంచి వెలువడే కలుషిత నీరు పంట పొల్లాలోకి వచ్చి చేరుతోంది. దీంతో పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. సర్వే నెంబరు 381లోకి కెమికల్ వాటర్‌ను వదిలేస్తుండటంతో పొలాల్లో రంగు మారిన నీరు వచ్చి చేరుతోంది. ఎర్రటి రంగులో ఉన్న నీరు పొలాల్లోకి చేరి పంటలు దెబ్బతింటున్నాయని, అధికారులకు అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు సమస్యలను విన్నవిస్తున్న కాలనీవాసులు

మేడ్చల్: పట్టణంలోని 6వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వార్డు ప్రజలు కోరారు. బీజేపీ నేతలతో కలిసి మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డిని కలిసి సమస్యలను విన్నవించి వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, చెత్త సేకరణ చేయడం లేదని, సమస్యలను వెంటనే తీర్చాలని కోరారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్టు సమాచారం. సుధాకర్‌రెడ్డి, నర్సింగ్ రావు, వెంకటేష్, శ్రీనివాస్, లక్ష్మి, దుర్గ, శారద, సావిత్రి, విజయలక్ష్మి, చంద్రకళ, ఫాతిమా పాల్గొన్నారు.



కార్పొరేషన్ బ్యాంకు సమీపంలో..



బస్ టెర్మినల్ ఎదురుగా ఏర్పడిన గుంతలు

గుంతలు.. చింతలు !

ఘట్‌కేసర్: పట్టణంలో చేపట్టిన రోడ్డు పనులతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ వైపు పనులు సాగుతుండగా వర్షం నీరు రోడ్డుపై నిలిచి గుంతలు ఏర్పడుతున్నాయి. బైపాస్ రోడ్డు నుంచి డీపీఎస్ స్కూల్ వరకు ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. బస్ టెర్మినల్, శివారెడ్డిగూడ, కార్పొరేషన్ బ్యాంకు సమీపంలో డీపీఎస్ స్కూల్ ఎదురుగా ఒక ఫీటులోతు గుంతలు ఏర్పడి ప్రయాణికులు గాయాల బారిన పడుతున్నారు. రెండ్రోజుల క్రితం డీపీఎస్ స్కూల్ సమీపంలోని గుంతలో పడి బాలాజీనగర్‌కు చెందిన ఓ మహిళకు గాయలై ఆసుపత్రి పాలైంది. గుంతలకు మరమ్మతులు చేయించి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

డయల్-ఏ-సెప్టిక్-ట్యాంక్ ..!

- ఓఆర్ఆర్ పరిధిలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ సేవలు
- వాహనాలను ప్రారంభించిన ఆస్కీ డైరెక్టర్ జనరల్



ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను ప్రారంభిస్తున్న ఆస్కీ డైరెక్టర్ జనరల్ రమేష్ కుమార్

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారులోని ఓఆర్ఆర్ పరిధిలో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాల నిర్వహణ, క్లీనింగ్ కోసం డయల్-ఏ-సెప్టిక్-ట్యాంక్ కార్యక్రమానికి గురువారం జలమండలి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఎస్టీపీలు, ఎఫ్ఎస్టీపీల వద్ద సెప్టిక్ వ్యర్థాలను రవాణా, డంపింగ్ కోసం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా సహకారంతో 50 మంది సెప్టిక్ ట్యాంక్ వాహనాల ఆపరేటర్లను ఎంపిక చేసింది. వీరికి సెప్టిక్‌ట్యాంక్ వ్యర్థాల నిర్వహణపై శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ ఇవ్వడమే కాకుండా విధి నిర్వహణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతాసామగ్రితో పాటు కార్మికులకు ప్రత్యేక యూనిఫామ్‌ను కూడా అందజేసింది. సెప్టిక్‌ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను ఆస్కీ డైరెక్టర్ జనరల్ రమేష్‌కుమార్, హెడ్‌ఇన్ ఇన్‌చార్జి జనార్దన్ రెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆస్కీ భవన ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు.

- 7 కార్పొరేషన్లు, 18 మున్సిపాలిటీలతో పాటు 18 గ్రామాల్లోని సెప్టిక్‌ట్యాంక్ మానవ వ్యర్థాలను శుద్ధిచేసి, పర్యావరణానికి ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ కార్యక్రమాన్ని రూపొందించింది.
- ప్రస్తుతం జలమండలి అంబర్‌పేట్, నల్లచెరువు, నానక్‌రామ్‌గూడ, ఖాజాగూడ ఎస్టీపీల వద్ద 40 కేఎల్‌డీ సామర్థ్యం గల కో-ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించి ఇప్పటి వరకు మొత్తం 84 మిలియన్ లీటర్ల సెప్టేజ్ కో-ట్రీట్‌మెంట్ ప్లాంట్లలో శుద్ధి చేశారు. ఇంతకుముందు ఉత్పన్నమయ్యే సెప్టిక్‌ట్యాంక్ వ్యర్థాలను చెరువులు, కాల్వలు, కుంటల్లో పారబోసి ఇటు పర్యావరణం, ప్రజల ఆరోగ్యానికి చేటుచేసే పరిస్థితి ఉండేది. దీనిని నివారించేందుకు సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను శుభ్రపరిచే వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ వాహనాలు సెప్టిక్ ట్యాంకర్ వ్యర్థాలను ప్రతిపాదిత ఎస్టీపీలల్లో డంపింగ్ చేసి, శుద్ధిచేయడం వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తవని జలమండలి అధికారులు చెబుతున్నారు. జలమండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్, సీజీఎంలు పద్మజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.